సాక్షి
చిత్తూరు
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



వైద్య సేవలపై నీలినీడలు
జీవో నం-85 రద్దు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు ఈ నెల 15 నుంచి ఆందోళనలు ఉధృతం చేయనున్నారు. - 8లో



వేద విద్యార్థులు హైందవ..
వేద విద్యార్థులు హైందవ ధర్మ సంరక్షకులుగా వ్యవహరించాలని టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రమణ్యం తెలిపారు. - 8లో



మొగిలి.. మృత్యుకౌగిలి
ప్రమాదాలకు నిలయంగా మారిన మొగిలి ఘాట్ రోడ్డులో ఏటా వందలాది మంది మృత్యువాత పడుతున్నారు. - 8లో

సీట్లు కుదించడం అన్యాయం



రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన మెడికల్ కళాశాల వల్ల నాలాంటి లక్షలాది మంది విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం, ఉన్న సీట్లను కుదించడం అన్యాయం. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలి. కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల కలలను నెరవేరేలా ప్రభుత్వం మేలు చేయాలే తప్ప అన్యాయం చేయకూడదు.

- షైనీ, నీట్ విద్యార్థిని, చిత్తూరు.



ప్రైవేటుపరం చేయడం దారుణం



కొత్తగా నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రైవేట్‌పరం చేయడం దారుణమైన విషయం. ఎంతో కష్టపడి నీట్ పరీక్షకు సన్నద్ధం అయ్యాం. పేద విద్యార్థులకు మేలు చేయాలని గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి మెడికల్ కళాశాలలను నిర్మించింది. ఇప్పుడు వాటిని ప్రైవేట్ పరం చేయాలనుకోవడం చాలా అన్యాయం. మదనపల్లెలో మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తే స్థానికులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది.

- డల్లియా, నీట్ విద్యార్థిని, చిత్తూరు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్‌గా పెద్దిరెడ్డి



చిత్తూరు కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) మెంబర్‌గా మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. ఈయనే చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగానూ, తిరుపతి జిల్లాలోని (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) నియోజకవర్గాల అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు.

రాష్ట్ర అధికార ప్రతినిధులు




భూమన కరుణాకరరెడ్డి, ఆర్‌కే రోజా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులుగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కే.రోజాను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వరసిద్ధునికి ముక్కంటీశుని పట్టువస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామికి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో మూర్తి, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం ఈవో గురు ప్రసాద్‌కు పట్టువస్త్రాలు అందించి, స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం అందజేశారు.

జెడ్పీ సీఈఓ బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ సీఈఓ గ్లోరియాను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మాతృశాఖ అయిన రెవెన్యూకు పంపుతూ ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఆమెను రిలీవ్ చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రకాశం జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ క్యాడర్‌లో ఉన్న గ్లోరియా బదిలీపై ఫిబ్రవరిలో చిత్తూరు జెడ్పీ బాధ్యతలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక సీఎం దగ్గరి బంధువు అయిన రవికుమార్‌నాయుడు సొంత జిల్లాలో సీఈఓగా రావాలని ప్రయత్నాలు మొదలుపెట్టారు. అప్పటి నుంచి ఆయన పావులు కదుపుతున్నారు. సీఈఓ స్థానంలో ఇన్‌చార్జి అధికారిని కలెక్టర్ నియమించనున్నారు. ఈ మేరకు వచ్చేవారం సీఈఓ పీఆర్ నుంచి రిలీవ్ అయి జీఏడీకి రిపోర్టు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. తర్వాత పోస్టింగ్ ఇచ్చే వరకు వేచిచూడాల్సి ఉంది.

17న విశ్వకర్మ జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 17న అధికారికంగా విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీ బాషా శుక్రవారం విలేకరులకు తెలిపారు. కలెక్టరేట్‌లోని పాత స్పందన హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించాలని గత ఏడాది ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

ఘాట్ రోడ్‌లో బండి న్యూట్రల్ చేస్తే మృత్యు హారన్ మోగినట్లే. దీనికి ఈ సంఘటనే సాక్ష్యం. డీజిల్ ఆదా కోసం న్యూట్రల్ చేసిన బండి అదుపు తప్పి దూసుకురావడంతో నాలుగు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. ఒక డ్రైవర్ చేసిన తప్పుకు ఏడుగురు బలయ్యారు. ఇనుప కమ్మీల లోడ్డుతో వస్తున్న లారీ డ్రైవర్ డీజిల్‌ను ఆదా చేసేందుకు బండిని న్యూట్రల్ చేసి, వేగం తగ్గించకుండా దూసుకెళ్లాడు. అయితే పల్లం రోడ్డు కావడంతో బ్రేక్ ఫెయిలయింది. అదే వేగంతో రోడ్డు మధ్యలోనున్న డివైడర్‌ను దాటుకుని పక్కరోడ్డులోకి వెళ్లి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఏడుగురి అక్కడికక్కడే మృత్యుఒడికి చేరారు. ఈ ఘటన రక్తపు రహదారిగా పేరొందిన మొగిలి ఘాట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది.



- ఏడుగురిని పొట్టన బెట్టుకున్న వైనం
- బస్సును ఢీకొట్టిన రెండు లారీలు
- వీటి మధ్యలో ఇరుక్కుపోయిన స్కూటరిస్ట్
- 31 మందికి గాయాలు, 8 మంది పరిస్థితి విషమం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

పలమనేరు/బంగారుపాళెం/చిత్తూరు రూరల్: బెంగళూరు నుంచి ఓ ట్రాలీ లారీ ఇనుప కమ్మీలతో చెన్నైకి బయలుదేరింది. ఈ లారీ డ్రైవర్ మొగిలి ఘాట్‌లో బండిని న్యూట్రల్ చేసి వేగంగా నడిపాడు. అయితే బండి అదుపుతప్పి బ్రేక్ పడక డివైడర్ దాటి పక్కనున్న రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై తిరుపతి నుంచి బెంగళూరు వెళుతున్న బస్సును వేగంగా ఢీకొంది. అదే సమయంలో ఆ బస్సు వెనుకవస్తున్న లారీ ఇదే బస్సును ఢీకొంది. ఈ వాహనాల మధ్యలో బైక్‌పై వస్తున్న వ్యక్తి ఇరుక్కుపోయాడు. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. 31 మంది గాయపడ్డారు. వారిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది.



మొగిలి ఘాట్‌లో నుజ్జునుజ్జయిన లారీ, బస్సు

మృతదేహాలను గుర్తుపట్టలేనంతగా..

ప్రమాదంలో మృతి చెందిన వారిలో ముగ్గురు శరీర భాగాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ ముఖంపై ఇనుప కమ్మీలు గుచ్చుకున్నాయి. దీంతో ఆమె ముఖం గుర్తుపట్టలేనంతగా ఉంది. అదే విధంగా మరో మహిళ తల పూర్తిగా వేరుపడింది. మరో ఇద్దరు శరీర భాగాల్లోని కాలు, పాదం వేరు వేరుగా కనిపించాయి. అక్కడి పడి ఉన్న శరీర భాగాలు ఎవరివనే విషయం తెలుసుకునేందుకు అధికారులు కష్టతరంగా మారింది.

విడిపోయిన లారీ క్యాబిన్

ఐరన్ లారీ వేగంగా డివైడర్‌ని ఢీకొని ఎగిరి అవతల రోడ్డులో బెంగుళూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సుపైకి దూసుకెళ్లింది. ఆ వేగానికి ఐరన్ లారీ క్యాబిన్ పైకొచ్చింది. ఆ బరువుకి లారీ క్యాబిన్ వేరైంది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఇద్దరు ఇనుప కమ్మీల కింద పడిపోయారు. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వారి మృతదేహాలను జేసీబీల సాయంతో వెలికి తీశారు.

డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

పలమనేరు వైపు నుంచి వెళుతున్న లారీ డ్రైవర్ బండిని న్యూట్రల్ చేయడమే ప్రమాదానికి కారణమైంది. వేగంగా వెళుతున్న లారీ ప్రమాదకర మలుపు వద్ద డ్రైవర్ బ్రేక్ వేసినా ఆగకుండా దూసుకెళ్లింది. డివైడర్‌ను దాటి అటువైపు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న అలిపిరి డిపో ఆర్టీసీ బస్సును ఢీకొంది. రెండు రోడ్ల మధ్యన ఎత్తయిన డివైడర్ లేదు. ఓ వైపునుంచి మరోవైపు రోడ్డుకు మధ్యలో అర అడుగు ఎత్తులో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఆ డివైడర్‌ను దాటి లారీ వేగంగా పక్కనున్న రోడ్డులోకి దూసుకుపోయింది.

సంఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ

సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంట చందోలు పరిశీలించారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. పలమనేరులోని ఆస్పత్రిలో రోగులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మొగిలి ఘాట్‌లో ప్రమాదాలపై ఇటీవలే ఎన్‌హెచ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. ఘాట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.



సంఘటనా స్థలంలో పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ



సంఘటన స్థలంలో మృతదేహాలు

ఆస్పత్రిలో క్షతగాత్రుల ఆర్తనాదాలు

తీవ్రంగా దెబ్బతిని చేతులు, కాళ్లు పోగొట్టుకున్న క్షతగాత్రుల ఆర్తనాదాలతో పలమనేరు ఆస్పత్రి మార్మోగిపోయింది. ప్రమాదం జరిగిన బస్సులో కొందరు యూపీకి చెందినవారు, కర్ణాటక వాసులున్నారు. వీరి వివరాలు తెలుసుకోవడం కష్టతరంగా మారింది. స్వల్పంగా గాయపడిన వారు వివరాలివ్వకుండానే ఆస్పత్రినుంచి వెళ్లిపోయారు.

రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్

మొగిలి ఘాట్‌లో రోడ్డు ప్రమాదం కారణంగా రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది.

సమాచారం కోసం

మొగిలిఘాట్‌లో మృతులు, గాయపడిన వారి సమాచారంకోసం హెల్ప్‌లైన్ నెంబర్లు చిత్తూరు ఆర్‌డీవో 94910 77005, పలమనేరు డీఎస్పీ 94407 96732, పలమనేరు ఏరియా ఆస్పత్రి 94400 12989 ను సంప్రదించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా యూపీకి చెందిన వారి వివరాలు పూర్తి స్థాయిలో లభ్యం కాలేదని తెలిపారు.

16 సార్లు ఉత్తమ డ్రైవర్‌గా మనోహరన్



తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్‌గా పాతికేళ్లుగా పనిచేస్తున్నారు.. ఆయనకు ప్రమాదమంటే తెలియదు.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడంలో ముందుంటారు. అందువల్లే ఆయన 16 సార్లు ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్నారు. అయితే శుక్రవారం మొగలి-పలమనేరు ఘాట్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు ఎస్.మనోహరన్. తమిళనాడు ఆర్కాడ్‌కు చెందిన ఇతను చిన్నతనంలోనే తల్లిదండ్రులతో వచ్చి తిరుపతిలో స్థిరపడ్డారు. పాతికేళ్లుగా భార్య ఉషారాణితో కలసి తిరుపతిలోని ఎర్రమిట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. మరోవైపు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అలిపిరి డిపో కండక్టర్ పి.చిరంజీవి పరిస్థితి విషమంగానే ఉంది.

కుమార్తెను చూడాలని..



పాకాల : మండలంలోని కంబాలమిట్టకు చెందిన విజయమ్మ కుమార్తెను చూడడానికి బెంగళూరుకు బయల్దేరింది. విజయమ్మను భర్త సుబ్రమణ్యం నాయుడు నేంద్రగుంటలో బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సులో ఎక్కించారు. అయితే కుమార్తెను చూడకుండానే, బస్సు ఎక్కిన గంటన్నర లోపే ప్రమాదంలో విజయమ్మ మృతి చెందింది.

నాగాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించకనే..



ప్రమాదంలో మృతిచెందిన శంకర్‌రెడ్డి సొంత గ్రామం గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ జంగాలపల్లి. ఈయన బెంగళూరులో స్థిరపడ్డారు. మరో రెండు రోజుల్లో స్వగ్రామంలో నాగాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించాల్సి ఉంది. భూమిరెడ్డి కుటుంబంలో ఒకరైన శంకర్‌రెడ్డి బెంగళూరు నుంచి స్వగ్రామానికి వచ్చి ఏర్పాట్లు చూసుకున్నారు. బెంగళూరులో ఉన్న భార్య, ఇద్దరు పిల్లలను స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు చిత్తూరులో ఆర్టీసీ బస్సు ఎక్కిన శంకర్‌రెడ్డి మొగిలి ఘాట్ ప్రమాదంలో మరణించారు. నాన్నతో సొంతూరుకి వెళ్లాలని ఆశగా ఎదురుచూస్తున్న ఇద్దరు పిల్లలు తండ్రి మరణవార్త విని బోరుమంటున్నారు.



చిత్తూరు, పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు,



చిత్తూరు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్ ఎస్పీ



వృషభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

గజరాజుపై గజాననుడి అభయం

వరసిద్ధుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గజరాజునెక్కిన గజాననుడు భక్తులకు అభయమిచ్చారు. స్వామి వారి దివ్య రూపాన్ని కనులారా వీక్షించి భక్తులు ఆనందపరవశులయ్యారు. గజవాహనంపై పురవీధుల్లో విహరించిన విఘ్ననాయకుడి అపురూప దృశ్యాన్ని చూసి పులకించిపోయారు. అశేష భక్తజనుల మధ్య గజవాహన సేవ అంగరంగ వైభవంగా సాగింది.

కాణిపాకం: కాణిపాకంలో స్వయంభుగా వెలసిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. వేకువ జామున ఆలయంలో శ్రీస్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు చేశారు. పుష్పశోభిత అలకరణలతో స్వామిని భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను సుందరమయంగా అలంకరించారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి అలంకార మండపంలో గణనాథుని ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. ఉభయదారులు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి గజ వాహనంపై కొలువు దీర్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వరసిద్ధి వినాయక స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ అధికారులు రథోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 7.45 నుంచి 8.45 గంటల మధ్య రథోత్సవానికి ముహూర్తం నిర్ణయించారు. మధ్యాహ్నం 3.05 గంటలకు ఉభయదారుల ఆధ్వర్యంలో వేడుకగా రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ముందుగా రథం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఆలయం వద్దకు తీసుకువస్తారు. రథానికి అశ్వాలు, ద్వార పాలకులు, రాక్షస బొమ్మల ఏర్పాటు పనులను ఆలయ ఈవో గురు ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసి ప్రసాదాలు సైతం అందరికీ అందేలా సిద్ధం చేశారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపడుతున్నారు. అడుగడుగునా నిఘా పెట్టారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు బలగాలను పెంచింది. ఈ మేరకు డీఎస్పీ సాయినాథ్, కాణిపాక ఎస్ఐ ధరణీధర వివరాలు వెల్లడించారు. డాగ్, బాంబ్ స్క్వాడ్లతో తనిఖీలు కూడా నిర్వహిస్తామన్నారు. ఒక డీఎస్పీ, 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 250 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేపు 'విశాఖ' బ్రాంచ్ ప్రారంభం



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలో ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ 53వ బ్రాంచ్‌ను ఆదివారం ప్రారంభించనున్నట్లు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు వెల్లడించారు. ఆయన శుక్రవారం చిత్తూరులో మీడియాతో మాట్లాడారు. ఈ బ్యాంకు 1916లో విశాఖపట్నం కేంద్రంగా ప్రారంభించగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 52 బ్రాంచ్‌లతో కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటికి రూ.4,25,441 కోట్లు డిపాజిట్లు సేకరించి, రూ.3,32,235 కోట్లు రుణాలుగా మంజూరు చేశామన్నారు. ఇంటి నిర్మాణం, వ్యాపార కార్యక్రమాలు, విద్య, వ్యక్తిగత, బంగారు రుణాలను అందించనున్నట్లు తెలిపారు. రుణాలను సక్రమంగా చెల్లిస్తే ఇన్సెంటివ్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు సత్యనారాయణమూర్తి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణారావు, జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, సీఈఓ వరలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ సురేష్, జిల్లా సీపీఐ కార్యదర్శి నాగరాజు, సీపీఐ నేత జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం



డీడీని మంత్రి లోకేష్‌కు అందిస్తున్న కళాశాల చైర్మన్

గంగవరం: విజయవాడ వరద బాధితుల కోసం మదర్‌థెరిసా కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు కలిసి సమకూర్చిన రూ.10 లక్షల మొత్తాన్ని డీడీ రూపంలో విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు కళాశాల చైర్మన్ స్వయంగా గురువారం అందజేశారు.

పేద విద్యార్థులపై భారం



మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. చదువుకునేందుకు వీలుగా ఉంటుంది. ప్రైవేటు పరం చేస్తే ఫీజులు భరించలేనంతగా పెంచేస్తారు. దీని వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుంది. గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలో తక్కువ ఫీజుతో ఎంబీబీఎస్ సీట్లు పొందేలా చర్యలు చేపట్టింది.

- ప్రియ, కనికాపురం, పాలసముద్రం మండలం



వైద్య విద్య నిర్వీర్యం



జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తక్కువ ఫీజుతో ఎంబీబీఎస్ సీట్లు పొందే అవకాశం కల్పించాలని ప్రయత్నించింది. ఈ నేపథ్యంలోనే మా అన్న కుమార్తె కూడా నీట్‌కు సిద్ధమవుతోంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించడం అన్యాయం. ఈ ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవాలి.

- బాలాజీ, కార్వేటినగరం

మొగిలి.. మృత్యుకౌగిలి!

- ఘాట్ రోడ్డంటేనే హడల్
- జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన రహదారి
- ఏడాదిలో ఒక్కసారైనా అతి భారీ ప్రమాదం
- నిద్రమత్తు, అతివేగం, నిర్లక్ష్యమే కారణాలు

చిత్తూరు అర్బన్: గతంలో చిత్తూరు దేనికి ప్రసిద్ధి అంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పుణ్యక్షేత్రాలైన తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి ఉండే జిల్లాగా చెప్పుకునేవారు. ప్రస్తుతం మొగిలి ఘాట్ రోడ్డు కూడా చెప్పుకునే పరిస్థితి వచ్చింది. అది కూడా గొప్పగాకాదు.. భయంతో.. ఎందుకంటే ఏటా ఇక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అత్యంత భయానకంగా ఉంటున్నాయి. తాజాగా ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో బస్సులో ఉన్న ఏడుగురు మృత్యువాత పడ్డారు. 33 మంది గాయపడగా 25 మంది కోలుకుంటున్నారు. మిగిలిన వాళ్ల పరిస్థితి విషమంగా ఉంది.

ఆ 14 నిముషాలే కీలం..!

మొగిలి–పలమనేరు ఘాట్ రోడ్డు అత్యంత ప్రమాదకరమైన రోడ్లలో ఒకటిగా గుర్తించబడింది. కేవలం 10.8 కిలోమీటర్ల దూరం. 14 నిముషాల ప్రయాణం. అంటే వాహనాన్ని గంటకు 55 కిలోమీటర్ల వేగంతో నడిపితే చాలు. ఈ లెక్కన సగటున 90 సెకన్లలో కిలో మీటరు వెళ్లాలి. అప్పుడే డ్రైవింగ్ నేర్చుకున్న వ్యక్తి కూడా ఈ ప్రయాణాన్ని చాలా సులువుగా, విజయవంతంగా ముగించొచ్చు. బెంగళూరుతో పాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకోవాలంటే తప్పనిసరిగా ఈ దారి వైపు రావాల్సిందే. ఇక వాణిజ్యపరమైన సరుకుల రవాణాకు సైతం ఇదే దారి తప్ప మరో దిక్కులేదు. దీంతో ఈ రహదారిపై వాహనాల సంఖ్య పెరిగింది. సమయం కంటే ప్రాణం విలువైనదని గుర్తించకుండా రక్తం మరిగిన ఈదారి వెంబడి నరబలి యజ్ఞంలా సాగుతోంది. మహాసముద్రాలు దాటినవాళ్లు పిల్లకాలువ ముందు బోల్తా కొట్టినట్లు ఎన్నో వేల కిలోమీటర్ల నుంచి వస్తున్న వాహన చోదకులు ఈ ఒక్కదారి దాటలేక ప్రమాదలకులోనై ప్రాణాలు విడుస్తున్నారు.

కారణాలివే...

ఇక్కడ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు మానవతప్పిదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు అలసిపోయి డ్రైవింగ్‌లో నిద్రమత్తుకు జారుకోవడం ప్రధాన కారణం. ఇక ఘాట్ రోడ్డు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అతి వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడాన్ని సైతం పోలీసులు గుర్తించారు. అన్నింటికంటే ముఖ్యమైనది మిట్ట ఎక్కి డౌన్‌లోకి వెళుతున్నప్పుడు ఇంధనం ఆదా అవుతుందని వాహనాన్ని న్యూట్రల్ చేయడం చాలా ప్రమాదకరం. దీనివల్ల వాహనం బ్రేక్ ఫెయిల్ కావడం, వేగం పెరగడంతో క్షణాల్లో ప్రమాదాలు జరిగిపోతున్నాయి. ఇక రోడ్డులో ఇంజినీరింగ్ పరమైన లోపాలు కూడా ఉన్నట్లు వెల్లడయ్యింది. రోడ్డు పూర్తిగా మలుపు తిరగడం, సిమెంటు రోడ్డు కావడం వల్ల జారుడు స్వభావం, రోడ్డు గ్రిప్ లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయి.

గత నాలుగేళ్లలో చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	735	324	805
2022	711	373	792
2023	702	351	653
2024 (ఆగస్టు)	500	249	624



మొగిలిఘాట్‌లో తాజాగా జరిగిన ప్రమాదం

చరిత్ర మిగల్చిన చేదు జ్ఞాపకాలు

- మొగిలి ఘాట్ రోడ్డులో 2019 నవంబరు 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది మృత్యువాత పడ్డారు. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న ఓ కంటైనర్ బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు దాటుకుని, ఎదురుగా వస్తున్న మినీ కారును ఢీ కొట్టడంతో 11 మంది చనిపోయారు.
- 2019 సెప్టెంబర్ 14న శ్రీవారిని దర్శించుకుని బెంగళూరుకు ఇన్నోవాలో బయలుదేరిన ఓ కుటుంబం గంగవరం మండలం మామడుగు సమీపంలో ప్రమాదానికి గురైంది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు సజీవ దహనమయ్యారు.
- 2016 జనవరి 24న ఇదే మొగిలి ఘాట్‌లో కుప్పం నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఇన్నోవాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.
- 2015 నవంబర్ 20న పలమనేరు ఘాట్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు చనిపోయారు.

సాంకేతిక సమస్యలు సరిచేస్తాం



జిల్లాలో మొగిలి ఘాట్ రోడ్డు రోడ్డు ప్రమాదాలకు డేంజర్ జోన్‌గా మారింది. ఇటీవల జరిగిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో మొగిలి రోడ్డు విస్తరణపై చర్చించాము. ఇంత లోపు ప్రమాదం జరగడం దురదృష్టకరం. మొగిలి ఘాట్ రోడ్డు వద్ద సాంకేతికపరమైన సమస్యలున్నాయి. రోడ్డు గ్రిప్ కోసం జాతీయ రహదారుల సంస్థ పీడీని పిలిపించి వారంలో దీన్ని సరిచేయాలని ప్రయత్నిస్తున్నాం.

- సుమిత్‌కుమార్, కలెక్టర్, చిత్తూరు

గస్తీ పెంచుతాం



ఈ రోడ్డుపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న మాట వాస్తవమే. రోడ్డు నిర్మాణంలో ఉన్న సాంకేతికపరమైన లోటుపాట్లను సరిదిద్దాల్సి ఉంది. జాతీయ రహదారుల శాఖ, కలెక్టర్‌తో దీనిపై చర్చించాం. స్పీడ్ లిమిట్ చూపే బోర్డులు, డివైడర్ ఎత్తును పెంచడం, వీలైతే మావాళ్లకు ఆ రూట్‌లో నిరంతరం డ్యూటీలు వేయడం, గస్తీ పెంచడం చేస్తాం. పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషిచేస్తాం.

- మణికంఠ, ఎస్పీ, చిత్తూరు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరి పరిస్థితి విషమం



గాయపడిన సుబ్రమణ్యం

శాంతిపురం: మండల కేంద్రంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మొరసనపల్లి పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం శాంతిపురం సబ్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్లో భోజనం చేసి మండల సచివాలయానికి బయలుదేరారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆయన్ను గుడుపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన నరేష్ మరో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరినీ స్థానికులు బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని రిటైర్డ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి



బాలకృష్ణ (ఫైల్)

పుత్తూరు: వడమాలపేట బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి చెందారు. స్థానిక పోలీసుల కథనం మేరకు, వడమాలపేట నుంచి స్వగ్రామం పాదిరేడుకు మోటర్ సైకిల్‌పై వెళ్తున్న రిటైర్డ్ బీట్ ఆఫీసర్ బాలకృష్ణ(63)ను తమిళనాడుకు చెందిన కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాలకృష్ణను తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు మృతి



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తవణంపల్లె: మండలంలోని తిరుపతి, బెంగుళూరు హైవే రోడ్డులో అతివేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని నత్తపుచేనుకు చెందిన జగన్నాథరెడ్డి భార్య ఎస్.చిట్టెమ్మ(65) రహదారికి అవతల ఉన్న పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరింది. రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో చిట్టెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారమందుకున్న ఎస్‌హెచ్‌ఓ అమీర్‌బాషా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన తొలివిడత పీజీ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో తొలివిడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని రిజిస్ట్రార్ భూపతి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో మొత్తం 1291 సీట్లుకు గాను 827 విద్యార్థులు పలు పీజీ కోర్సులలో ప్రవేశాలు పొందినట్లు తెలియజేశారు.

వేద విద్యార్థులు హైందవ ధర్మ సంరక్షకులు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఈవో ఎల్వీ సుబ్రమణ్యం

తిరుమల: వేద విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, సనాతన హిందూ ధర్మ సంరక్షకులుగా వ్యవహరించాలని ఏపీ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ, టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో శుక్రవారం జరిగిన గణేశ నవాహ్నిక ఉత్సవాల్లో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎల్వీ మాట్లాడుతూ..వందలాది మంది విద్యార్థులకు వేద విజ్ఞానాన్ని ప్రసాదిస్తోన్న ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం దేశంలోనే పురాతన విద్యాసంస్థల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. టీటీడీ ఏఈవో మాట్లాడుతూ..విద్యార్థులకు వేద విద్యను అందించడమే కాకుండా వారి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.

మహిళను ఏమార్చి.. ఏటీఏం కార్డు మార్చేసి..

నాయుడుపేటటౌన్ : ఓ మహిళ వద్ద నుంచి ఏటీఎం కార్డును చాకచక్యంగా తస్కరించి ఆమె ఏటీఎం నుంచి రూ.40 వేలు డ్రా చేసినట్లు బాధిత మహిళ శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. మండల పరిధిలోని అయ్యప్పరెడ్డిపాళెం జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న శారద ఈనెల 9వ తేదీన ఆమె నాయుడుపేటలోని సీఎస్‌తేజ సెంటర్ సమీపంలో ఉన్న ఇండియా ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లింది. అయితే ఆమె వెనుక ఉన్న ఓ వ్యక్తి ఆమెను మాటల్లో పెట్టి ఏటీఎం కార్డు మార్చి ఇచ్చాడు. ఆమె పిన్ నంబరు కూడా గుర్తించాడు. అనంతరం ఆమె నకిలీ ఏటీఎం కార్డుతో నగదు రాకపోవడంతో ఇంటికి వచ్చేసింది. అయితే ఆమె ఏటీఎం కార్డులో నుంచి అదే రోజు నాయుడుపేటలోని ఓ ఏటీఎంలో రూ.20 వేలు, గూడూరులోని ఓ ఏటీఎంలో మరో రూ.20 వేలు నగదు డ్రా చేసుకున్నట్లుగా మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పును కప్పిపుచ్చుకోవడానికే బోట్ల రాజకీయం



మాట్లాడుతున్న నారాయణస్వామి

పాలసముద్రం : విజయవాడ వరదలకు ప్రభుత్వ తప్పిదమే కారణమని, దాన్ని కప్పి పుచ్చుకునేందుకు బోట్ల రాజకీయం చేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆరోపించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, బుడమేరు గేట్లు ఎత్తితే విజయవాడకు వరద ముప్పు వస్తుందని తెలిసినా, ప్రజలను అప్రమత్తం చేయలేదని చెప్పారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టాన్ని నివారించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పేర్కొన్నారు. దాని ఫలితంగానే వరదలొచ్చి 15 రోజులైనా ఇంకా విజయవాడలోని కాలనీలు వరద ముంపులోనే ఉన్నాయని చెప్పారు. కృష్ణా నది కరకట్టపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసాన్ని, బుడమేరుపై ఉన్న రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం వరద నీటిని విజయవాడ వైపు మళ్లించి సుమారు 60 మంది మరణానికి, వేల కోట్ల రుపాయల ఆస్తి నష్టానికి కారణమయ్యారని మండిపడ్డారు. వరదల్లో మరణించిన కుటుంబాల వారికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బోట్లకుట్ర పేరుతో ప్రభుత్వం నాటకాలాడుతోందని ఎద్దేవా చేశారు. ఇలాంటి డ్రామాలు పక్కనపెట్టి, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 09 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 63,544 మంది స్వామివారిని దర్శించుకోగా 22,942 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యే క ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

వైద్య సేవలపై నీలినీడలు

గత ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. కానీ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వైద్యరంగంపై చిన్నచూపు చూస్తోంది. ఇప్పటికే కొత్త మెడికల్ కళాశాలల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రభుత్వ వైద్యుల కోటాపై అందే పీజీ సీట్లకు కోత పెట్టేలా జీఓ నంబర్ 85ను అమలు చేసేందుకు సిద్ధమైంది. దీంతో గ్రామీణ ప్రాంతాల పీహెచ్‌సీ వైద్యుల నుంచి నిరసన జ్వాలలు వ్యక్తం అవుతున్నాయి.

- గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీ వైద్యులకు సంకటంగా జీఓ నంబర్ 85
- నల్లబ్యాడ్జీలతో విధులు
- జీఓపై పునరాలోచన చేయాలని డిమాండ్



జీఓ రద్దు చేయాలంటూ తిరుపతి డీఎంహెచ్‌ఓ శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న వైద్యులు (ఫైల్)

వెంకటగిరిరూరల్/వెంకటగిరి(సైదాపురం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైద్య రంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇన్ సర్వీసు కోటా సీట్లలో కోత విధిస్తూ జీఓ నంబర్ 85 అమలు చేయాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో సర్వీసు కోటాకు అర్హత గల వైద్యులకు క్లినికల్ సీట్లను 50 శాతం వరకు రిజర్వేషన్ కోటాగా పీజీ సీట్లను కేటాయించారు. ఇప్పుడు ఆ కోటాను సగానికి తగ్గించడంపై గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన వ్యక్తం పరుస్తున్నారు.

జీఓ నంబర్ 85తో ఇక్కట్లు

కూటమి ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీఓ నంబర్ 85 నిబంధనల మేరకు ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రభుత్వ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో కనీసం మూడేళ్లు లేదా ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం రెండేళ్లు రెగ్యులర్ సేవలు అందించిన వారిని ఇన్ సర్వీసు కోటాలో అర్హులుగా గుర్తిస్తారు. వీరికి పీజీ విద్యలో ప్రవేశానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఇన్ సర్వీసు కోటాను ప్రవేశ పెట్టి క్లినికల్ సీట్లకు 15 శాతం, నాన్ క్లినికల్ 30 శాతం వరకు రిజర్వేషన్ కల్పించారు. ఈ జీఓ నెం.85 వద్దని, పాతపద్ధతిలోనే ఇవ్వాలని పీహెచ్‌సీ వైద్యులు కోరుతున్నారు. పీజీ చేసిన ప్రభుత్వ వైద్యులకు వివిధ స్థాయి ఆస్పత్రుల్లో స్పెషాలిటీ వైద్యులుగా నియమించుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం కోటాను తగ్గించడంతో ఇటు ఉన్నత చదువులతో పాటు మెరుగైన వైద్యం అందించే అవకాశాలు ప్రభుత్వ పరంగా కోల్పోవాల్సి వస్తుంది.

కొనసాగుతున్న నిరసనలు..

తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతాల పరిధిలో 58 పీహెచ్‌సీలు ఉండగా అందులో 122 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీలో ఉన్న వైద్యులకు ఇబ్బందికరంగా మారిన జీఓ నెం.85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం నిరసన కార్యక్రమాలు వ్యక్తపరుస్తూ కొనసాగిస్తున్నారు. ఈనెల 10న ప్రారంభమైన ఆందోళనల్లో భాగంగా వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ వైద్యసేవలు అందిస్తున్నారు. తక్షణం జీఓ రద్దు చేయకపోతే అత్యవసర, ఓపీ సేవలు మినహాయించి అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ అధికారిక కమ్యూనికేషన్లు నిలిపివేస్తామని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈనెల 14వ తేదీన పీహెచ్‌సీ సేవలు కేవలం అత్యవసర వైద్యసేవలకు మాత్రమే పరిమితం చేయనున్నారు. 15వ తేదీన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద చలో విజయవాడ ర్యాలీ చేపట్టనున్నారు. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే ఈనెల 18వ తేదీ నుంచి జీఓ నంబర్ 85 రద్దు చేసే వరకు నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగించనున్నట్లు వైద్యుల సంఘ సభ్యులు చెబుతున్నారు. ఇదేగనుక జరిగితే గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైద్యరంగం, వైద్యులపై కక్షసాధింపు ధోరణి వీడి జీఓ 85ను రద్దుచేయాలని వైద్యులు కోరుతున్నారు.

జీఓను రద్దు చేయాల్సిందే.



పీహెచ్‌సీ వైద్యులను ఇబ్బందులకు గురిచేసే విధంగా రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 85ను వెంటనే రద్దుచేయాలి. గతంలో ఉన్న పీజీ సీట్ల కోటాను తగ్గించడం, కొత్త నిబంధలను జోడించడం సమంజసం కాదు. ఈ మేరకు కోటాలో కూడా క్లినికల్ పీజీ సీట్లలో కేవలం ఆరు విభాగాలకే పరిమితి చేయడం సమంజసం కాదు. ప్రభుత్వం నిర్వహించే చర్చించి జీఓను వెంటనే రద్దు చేయాలి.

- డాక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఏపీపీహెచ్‌సీడీఏ తిరుపతి జిల్లా ప్రెసిడెంట్